రైతన్నకు యూరియా తిప్పలు



ఆత్మకూర్(ఎస్) : ఏపూరు పీఏసీఎస్ ముందు గుమిగూడిన రైతులు



నూతనకల్‌లో సహకార సంఘం వద్ద బారులుదీరిన రైతులు

- రైతు సహకార సంఘాలు, ఆగ్రోస్ సేవా కేంద్రాల వద్ద బారులుదీరిన కర్షకులు
- కొందరికే అందిన యూరియా
- సరిపడా అందించాలని వేడుకోలు

ఆత్మకూర్ (ఎస్) : పలు మండలాల్లో యూరియా కోసం రైతులు సోమవారం పీఏసీఎస్ కేంద్రాల వద్ద నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం ఆత్మకూర్ (ఎస్), ఏపూరు పీఏసీఎస్‌లకు ఒక లారీ యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు వర్షం వస్తున్నప్పటికీ తెల్లవారుజామున 4గంటల నుంచే క్యూలైన్‌లో నిల్చుకున్నారు. ఒక్కో పీఏసీఎస్ సెంటర్‌లో 220 బస్తాల యూరియా రాగా ఒక్కో రైతుకు 2బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చాలామంది రైతులకు యూరియా దొరక్క వెనుదిరిగిపోయారు. మరో రెండు రోజుల్లో యూరియా వస్తుందని అధికారులు తెలిపారు.

నూతనకల్‌లో బారులు

నూతనకల్ : మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ముందు సోమవారం రైతులు యూరియా కోసం బారులుదీరారు. సహకార సంఘానికి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ముందే కార్యాలయం వద్దకు వచ్చి క్యూకట్టారు. కేవలం 220బస్తాల యూరియా మాత్రమే రావడంతో కొందరికే పంపిణీ చేశారు. యూరియా దొరకని వారు నిరాశతో వెనుదిరిగారు.

మద్దిరాలలో..

మద్దిరాల : మండల కేంద్రంలోని సహకార సొసైటీతో పాటు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి సోమవారం యూరియా రావడంతో రైతులు పెద్ద మొత్తంలో బారులుదీరారు. ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చాలా మంది రైతులకు యూరియా అందకపోవడంతో నిరుత్సాహంతో వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరారు.

సరిపడా యూరియా అందించాలని..

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఎరువుల దుకాణానికి సోమవారం యూరియా రావడంతో రైతులంతా ఒకేసారి ఎగబడ్డారు. ఆధార్ కార్డుతో రైతులకు యూరియా అందించారు. సరిపడా యూరియా ఇవ్వనందుకు కొందరు రైతులు ఆగ్రోస్ ఎరువుల దుకాణం ముందు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ఎస్ఐ

సాక్షి ఎఫెక్ట్..

పెన్‌పహాడ్: మండలంలోని మాచారం గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను సోమవారం పెన్‌పహాడ్ ఎస్ఐ గోపికృష్ణ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎస్ఐ స్పందించారు. వెంటనే జేసీబీ సహాయంతో కంకర తెప్పించి అక్కడక్కడా రోడ్డుపై ఉన్న గుంతల పూడ్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షి పత్రిక సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో రోడ్డు భద్రతలో భాగంగా పూడ్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ప్రవీణ్, హోంగార్డు రవినాయక్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత

అర్వపల్లి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో సోమవారం పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, డ్రగ్స్, గంజాయి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, పల్లెల రాము, భిక్షపతి, ఉదయ్, శంకర్, ఉపేందర్, నాగలక్ష్మి, మంజుల, రాధ, మల్లమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 7న నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు బండారు సైదులు పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూర్(ఎస్)మండలం కందగట్ల గ్రామంలో సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కందగట్ల గ్రామ శాఖ సిబ్బంది అధ్యక్షుడు బొల్లె లక్ష్మయ్య, లింగంపల్లి విక్రమ్, జాటోత్ లింగ్యా, పోల్దాస్ మహేష్, యాళ్లబోయిన శ్రీను, కుశనపల్లి యల్లయ్య, గుండు లచ్చయ్య పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల అరెస్టు

తిరుమలగిరి, అర్వపల్లి, మద్దిరాల, పెన్‌పహాడ్ : తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన ఆశా కార్యకర్తలను సోమవారం తిరుమలగిరి, అర్వపల్లి, మద్దిరాల, పెన్‌పహాడ్‌లో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించిన ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏఎన్ఎం పోస్టులలో ఆశా కార్యకర్తలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలిపారు. తిరుమలగిరిలో కె.విజయ, మాసంపల్లి మాధవి, యాకలక్ష్మి, స్వరూప, మహేశ్వరి, తహేలా, శైలజతోపాటు ఆయా మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరు కాపులంతా సభ్యత్వం తీసుకోవాలి



సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి: మున్నూరు కాపులంతా సంఘంలో సభ్యత్వాలు తీసుకోవాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు పిలుపునిచ్చారు. అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన మున్నూరు కాపు సంఘం మండల సమావేశం, సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి తమ కుల బలాన్ని తెలియజేయడానికే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల మహేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి పసునూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చెంచల శ్రీనివాస్, దాసరి సోమయ్య, రంగయ్య, మిర్యాల వెంకన్న, గోసుల విజయ్, యాదయ్య, కృష్ణమూర్తి, రామనర్సయ్య, కరుణాకర్, సుదర్శన్, ప్రభాకర్, వెంకన్న, అశోక్, కాశయ్య, శేఖర్, సోమయ్య పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్ బహూకరణ



రిఫ్రిజిరేటర్ బహూకరిస్తున్న వెంకట్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, అడ్వకేట్ దండా వెంకట్‌రెడ్డి తన కూతురు సీరజ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం గ్రామంలోని పల్లె దవాఖానాకు రిఫ్రిజిరేటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, ఏఎన్ఎం పూలమ్మ, భవాని, ఆశా కార్యకర్తలు మహాలక్ష్మీ, సంధ్య, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ కె.నరసింహ



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : పోలీస్ కుటుంబాలకు పోలీస్ సంక్షేమ సంఘం అండగా ఉంటుందని ఎస్పీ నరసింహ అన్నారు. కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ రాంబాబు కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల సాలరీ ప్యాకేజ్ ఎస్‌బీఐ ఇన్‌స్రూ చెక్కును సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేసి మాట్లాడారు. విధి నిర్వహణ సమయంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్, ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం..

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదుదారులు స్వీకరించి వారి మాట్లాడారు. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'కాళేశ్వరం'పై ప్రభుత్వానిది దుష్ప్రచారం



సూర్యాపేటలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాన్ని చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపు మేరకు సూర్యాపేట భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంజనాపురి కాలనీ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కాళేశ్వరాన్ని నడిపిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని అసెంబ్లీలో 100 అబద్ధాలు ఆడుతూ కాంగ్రెస్ మంత్రులు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు యూరియా, సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి విలాసాల పర్యటనలు, అక్కరలేని కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. రైతులు కష్టాల్లో ఉంటే సీఎం వారిని పట్టించుకోకుండా 2036లో నిర్వహించే ఒలింపిక్స్‌కు రివ్యూ నిర్వహించడం శోచనీయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.94వేల కోట్లు ఖర్చు చేస్తే రూ.లక్ష కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



చివ్వెంల : జి.తిర్మలగిరిలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



జాజిరెడ్డిగూడెంలో సర్వే చేస్తున్న నాయకులు

చివ్వెంల : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చివ్వెంల మండలం జి.తిర్మలగిరి, గుంపుల గ్రామాల్లో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా సమస్యలపై సర్వే నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇట్టమళ్ల స్టాలిన్, బచ్చలకూరి రాంచరణ్, కొల్లూరి బాబు, నాగయ్య, రాములు, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీలోని 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం కొత్త రోడ్లను తవ్వి తీసిన గుంతలను వెంటనే పూడ్చాలని సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పోరుబాటలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు గండమల్ల భాగ్యమ్మ, శశిరేఖ, సైదమ్మ, ఎల్లమ్మ, పిట్టల రాణి, పద్మ, వెంకటమ్మ, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ సమస్యలపై సర్వే నిర్వహించారు. యూరియా కొరతను తీర్చాలని, గ్రామంలో వాటర్ ప్లాంట్ మరమ్మతు చేయించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, కొమ్ము విజయ్, శిగ రవి, వీరయ్య, గంగయ్య, రవి, పగిడిమర్రి శేఖర్, శ్రీకాంత్, ఇందిరమ్మ, నాగమ్మ, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటరాజు డిమాండ్ చేశారు. సోమవారం తుంగతుర్తిలో నిర్వహించిన ఆ సంఘం మూడవ జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తూ దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుందన్నారు. అభివృద్ధి పేరుతో దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతుందని విమర్శించారు. కార్మికులకు అడ్డాల్లో మౌలిక వసతులు కల్పించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సభలో సీఐటీయూ నాయకులు ఎం రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు, చెరుకు యాకలక్ష్మి, బుర్ర శ్రీనివాస్, రాధాకృష్ణ, మల్లయ్య, ఎలుక సోమయ్య, రమేష్, శేఖర్, మన్సూర్ అలీ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కోటరాజు

ఆర్డీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే కిషోర్ పరామర్శ



మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. మాజీ మంత్రి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్‌రావు, సంకేపల్లి రఘునందన్ రెడ్డి, శోభన్ బాబు, తాటికొండ సీతయ్య ,గుండగాని రాములు గౌడ్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సంతాపం

మద్దిరాల : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన మీసాల అరివేష్ తండ్రి పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్,కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగెల్లి శ్రవణ్‌కుమార్, వెలుగు వెంకన్న, మూరగుండ్ల సోమయ్య, తదితరులు ఉన్నారు.

మాలల సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి



మాట్లాడుతున్న వేణు బలరాం

సూర్యాపేట : రోస్టర్ విధానంతో మాలలకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో చర్చించాలని మాల మహానాడు జేఏసీ జిల్లా కన్వీనర్ వీర్జాల వేణు బలరాం డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని మాల మహానాడు జేఏసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, షమీం అక్తర్ రిపోర్టును మేధావులతో, న్యాయ నిపుణులతో, ప్రతిపక్ష పార్టీలతో, మాల, మాదిగ ఎమ్మెల్యేలు మంత్రులతో చర్చించకుండా, ఏకపక్షంగా చేసిన వర్గీకరణ వల్ల మాల అనుబంధ కులాలకు అన్యాయం జరగనుందన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు జేఏసీ జిల్లా మహిళా కన్వీనర్ పిట్టల భాగ్యమ్మ , జిల్లా కోకన్వీనర్లు కట్టా సైదులు, కట్ట మురళి, బోయిల్ల అఖిల్, తుమ్మకొమ్మ విజయ్, కోడి రెక్క సుధాకర్, గండమల్ల విజయ్, బొల్లెద్దు సామ్రాట్, మేడే ఉమా తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



సూర్యాపేటలో సద్దుల చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ, ఇతర అధికారులు



తిరుమలగిరి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలో ఈనెల 5న జరగనున్న నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. సోమవారం ఆయన డీఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హనుమంతరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్యతో కలిసి నిమజ్జనం జరిగే సద్దుల చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్ రూరల్ ఎస్ఐ బాలు నాయక్ ,మున్సిపల్ డీఈ సత్యారావు, టీపీఓ సోమయ్య, ఏఈ తిరుమలయ్య ,ఆర్ఐ శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది ఎస్ఎస్ఆర్.ప్రసాద్, యాదగిరి, సమ్మి, రంజిత్, వేణు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): వినాయక నిమజ్జనాన్ని భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, సీఐ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ కోరారు. సోమవారం తిరుమలగిరి మున్సిపాల్టి పరిధిలోని పెద్ద చెరువులో వినాయకులను నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ శోభ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

సూర్యాపేటటౌన్ : యువతీయువకులు డ్రగ్స్‌తోపాటు మద్యానికి బానిసలు కావొద్దని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. నో డ్రగ్స్.. సేవ్ లైఫ్ నినాదంతో సోమవారం సాయంత్రం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. విచిత్ర వేషధారణతో చేతిలో మైకు పట్టుకొని స్థానికులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. తాను ప్రభుత్వ టీచర్‌నైనా సెలవు రోజుల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డికి నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నూతనకల్ : మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డికి సోమవారం ప్రజలు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. సోమవారం ఎర్రపహాడ్‌లో నిర్వహించిన ఆయన దశదిన కర్మకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి కృష్ణారెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కొప్పుల వేణారెడ్డి, తీగల గిరిధర్ రెడ్డి, నాగం సుధాకర్‌రెడ్డి, పసుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దుచేయాలి



తుంగతుర్తి : బండరామారం హైస్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



తిరుమలగిరిలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి : సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని జాక్టో జిల్లా నాయకుడు కడపర్తి శ్రీనివాస్ నాయుడు అన్నారు. సోమవారం తుంగతుర్తి మండలం బండ రామారం జెడ్పీహెచ్ఎస్‌లో భోజన విరామ సమయంలో నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాక్టో నాయకులు బంధం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దేవా, వెంకట్ రాములు ,కోటయ్య, సుజాత, ఉమారాణి, గీత తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సీపీఎస్‌ను రద్దుచేయాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్లో జరిగిన మహా ధర్నాకు మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, రాములు, యాదగిరి, సుందర్, సత్తిరెడ్డి, దస్తగిరి, అతిఫ్‌అలీ, దుర్గాప్రసాద్, మున్వర్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ పరికరాలు

చివ్వెంల: రైతులకు సబ్సిడీపై అందించేందుకు వివిధ రకాల వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు చివ్వెంల ఏఓ ధరావతు వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, మహిళ, చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతర సామాజిక వర్గాల పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో ఈనెల 6వరకు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గణపయ్య సన్నిధిలో పూజలు, అన్నదానాలు



భానుపురి : సూర్యాపేట మార్కెట్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



తిరుమలగిరి : బొజ్జ గణపయ్యకు ఉండ్రాళ్లు సమర్పిస్తున్న మహిళలు



ఆత్మకూర్(ఎస్) : దుబ్బగూడెంలో చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



సూర్యాపేట : అన్నదానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ పల్స మహాలక్ష్మీమల్సూర్ గౌడ్



అర్వపల్లి : రామన్నగూడెంలో అన్నదానం

మాకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

భానుపురి (సూర్యాపేట) : రికార్డులను తారుమారు చేసి మా భూమిని అక్రమంగా ఇతరుల పేరు మీద పట్టా చేయాలని చూస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని హుజూర్‌నగర్‌కు చెందిన పిల్లుట్ల లక్ష్మి, పిల్లుట్ల నాగేంద్రమ్మ వేడుకున్నారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతి పత్రం అందించారు. తమ సమస్యను కలెక్టర్‌కు వివరించారు. గత నెల 29న తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరై అన్నీ డాక్యుమెంట్లు అందించామని, అయినా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలానికి మంజూరైన కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు మంగళవారం అర్వపల్లిలో జరిగే సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ టి.గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులంతా విధిగా ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.